## క్లుప్తంగా

### బెల్ట్ షాపులపై దాడులు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల గ్రామంలో బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై గంగధారం కథనం ప్రకారం ఈ దాడుల్లో ఓ బెల్ట్ షాపులో రూ.5 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం షాపు నిర్వాహకుడు సదానందంపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### నేడు వాహనాలకు వేలం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు బుధవారం భూపాలపల్లిలోని హనుమాన్ నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఆ శాఖ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 50 శాతం ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. కొనుగోలు చేసిన వాహనాలకు జీఎస్టీ అదనంగా చెల్లించాలన్నారు.

### చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

మల్హర్ : మండలంలోని కొయ్యూరు గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరస్వతి మాట్లాడుతూ 3 సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కేంద్రంలో చిన్నారులకు ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తామన్నారు. అలాగే, మల్లారం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ నుంచి పిల్లలను ప్రైమరీ స్కూల్‌కు పంపించడానికి పాఠశాల ఉపాధ్యాయులుతో కలసి బడి బాట నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరిత, సుజాత, రుద్రామదేవి, సాంబయ్య, యోగి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం: ఈనెల 11వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జీసీసీ గోదాం వద్ద ప్రజాగర్జన పోస్టర్, కరపత్రాలను కార్మికులతో కలసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా ఉండే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాసర్, సారయ్య, ఏఐటీయూసీ నాయకులు బిక్షపతి, కొమురయ్య, రాములు, కుమారస్వామి, రమేష్, శ్రీధర్, బాబు, రవి, ఎల్లయ్య, సుధాకర్, కృష్ణ, రాజు, సురేష్ పాల్గొన్నారు.

### చేయూత

వెంకటాపురం(ఎం): మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన మడికొండ రమేష్ ఇల్లు ఇటీవల విద్యుదాఘాతంతో దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న ములుగు, భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మంగళవారం భాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు.

### విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి



మొగుళ్లపల్లి: మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వంగపల్లి రాములుకు చెందిన కాడెద్దు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందింది. సుమారు రూ.90వేల ఎద్దు చనిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విలపించాడు.

### పరామర్శ

ఏటూరునాగారం : మండలంలోని కొండాయి ఎంపీటీసీ మల్లెల ధనలక్ష్మి విద్యుత్ షాక్‌తో మృతి చెందగా మంగళవారం జరిగిన దహన సంస్కారాలకు ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, బీఆర్ఎస్ నాయకులు హాజరై అంతిమయాత్రంలో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జగదీష్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వలియాబీ, ఎంపీపీ విజయ, మల్లారెడ్డి, స్వప్న, ఖాజాపాషా, శ్రీనివాస్, రాంబాబు, బోజారావు, రమేష్, రాంబాబులు ఉన్నారు.

ములుగు రూరల్ : మండలంలోని జీవింతరావుపల్లి గ్రామానికి చెందిన కొండబోయిన సదయ్య మృతిచెందగా ములుగు ఎమ్మెల్యే సీతక్క మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. సదయ్య మృతదేహానికి పూలమాల వేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, సర్పంచ్ రత్నం భద్రయ్య, దేవ్‌సింగ్, పాల్గొన్నారు.

# నిరుపేద యువతి వివాహానికి ఎమ్మెల్యే చేయూత

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన నిరుపేద యువతి వివాహానికి మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చేయూతనందించారు. గ్రామానికి చెందిన మొలంగిరి కిష్టయ్య, మల్లక్క దంపతులు నిరుపేదలు. వారి కుమార్తె వనిత వివాహం బుధవారం జరగనుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మంగళవారం వారి ఇంటికి వెళ్లారు. వివాహ ఖర్చుల నిమిత్తం నగదు సాయంతోపాటు నూతన వస్త్రాలు అందజేసి యువతిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేశ్, మండల అధ్యక్షుడు పాడి రాజయ్య, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చిలువేరు శ్రీధర్, పాడి సరోజన, రేపాల స్వామి, సర్పంచ్‌లు కంకణాల లత, వేమునూరి రమేశ్‌రెడ్డి, ఎంపీటీసీ జాడి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం, దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

# సమ్మె కొనసాగిస్తాం

భూపాలపల్లి రూరల్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని సంఘం మండల అధ్యక్షురాలు తోట పద్మ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించకుండా తొమ్మిది సంవత్సరాలుగా కాలాయాపన చేస్తోందని మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కమలాకర్ సైతం జూన్1న రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అందిస్తామన్నారని.. కానీ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదని చెప్పారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు నేరేళ్ల స్వప్న, బచ్చల రవి, పెర్కారి యుగేందర్‌రావు, పైడిపెల్లి స్వామి, గౌరిశెట్టి శేషాద్రి, సుంకర ప్రసన్న రాణి, ఆనందపు లావణ్య, నాగుల స్వరూప, నన్నపు శంకరమ్మ, గురిజాల సుజాత, జంగిపెల్లి శారద, కోంద్ర రవీందర్, ఆకునూరి ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్లు

### అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ రమ్యబాయి

మహాముత్తారం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పెదగపల్లి, ప్రేమ్‌నగర్, ఆంజనేయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమ్యబాయి, మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు జాటోత్ చరణ్‌బాయి, రజితబాయి, అజ్మీరా విజయబాయి, తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని భూపాలపల్లి మండల రేషన్ డీలర్ల వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తహశీల్దార్ గ్రాబ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తొమ్మిదేళ్లుగా ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈనెల1వతేదీ వరకు సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయినా ఫలితం లేదన్నారు. దీనిపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి సమ్మయ్య, కవిత, లక్ష్మయ్య, నర్సయ్య, మంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంటలపై వదంతులు

మల్హర్: మల్హర్ మండల కేంద్రం తాడిచర్ల(పెద్దతాడిచర్ల)లోని ఓ ఇంట్లో అకస్మాత్తుగా మంటలు వ్యాపిస్తున్న విషయంపై నాలుగు రోజులుగా మండలంలో చర్చ సాగుతోంది. ఎవరో చేతబడి చేసి కుటుంబాన్ని టార్గెట్‌గా చేసి ఇలాంటి పనులు చేస్తున్నారని కొందరు అనుకుంటున్నారు. మరికొందరు ఇటీవల పెద్ద తాడిచర్లలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం సరిగ్గా చేయలేదని అందుకే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చర్చ కొనసాగుతుంది. పెద్ద తాడిచర్ల గ్రామానికి చెందిన మందపల్లి పోచయ్య అనే వ్యక్తి ఇంట్లో, ఇంటి ఆవరణలో గురువారం అకస్మాత్తుగా మంటలు చెలరేగి వరిగడ్డి వాము కాలిపోయింది. శుక్ర, శని, ఆది, సోమవారాల్లో కూడా స్వల్పంగా ఇంట్లో మంటలు చెలరేగాయి. మంగళవారం ఉదయం కూడా ఇంట్లో బెడ్‌పైన, చీరలపైన మంటలు అంటుకున్నాయి. మంటల వ్యాప్తిపై ఆర్ఐ సరిత అక్కడికి చేరుకొని ఆరా తీశారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగుతున్నాయా.. రసాయన పదార్థాలతో మంటలు వస్తున్నాయా.. లేక వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే విషయంపై తేలాల్సి ఉంది.



మంటలపై ఆరా తీస్తున్న ఆర్ఐ సరిత

# పౌష్టికాహారం అందజేత

చిట్యాల: మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్ మంగళవారం పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మొక్కలు నాటారు. ఈ నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయ్యే గుడ్లు స్టాంపింగ్‌తో మూడు రంగులలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్‌లు భాగ్యలక్ష్మీ, జ్యోతి, ఆయాలు పద్మ, వినోద తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు గుడ్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ కట్కూరి పద్మ

# రామప్ప అభివృద్ధికి నిధులు కేటాయించాలి

వెంకటాపురం(ఎం): యునెస్కో గుర్తింపు సాధించిన రామప్పలో రాష్ట్ర మంత్రులు పర్యటనలు చేయడమే కాని నిధులు కేటాయించడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ విమర్శించారు. మండలంలోని లక్ష్మీదేవిపేటలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్మును వృధా చేస్తున్నారని విమర్శించారు. నేడు రామప్ప పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్ సరస్సుకట్ట అభివృద్ధితో పాటు సరస్సులోని ఐలాండ్‌లో ధ్యాన కేంద్రాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రామప్ప అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకురాలేని మంత్రులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కారుపోతుల యాదగిరి, నాగయ్య, సంతోష్, సుమన్‌రావు, ధరంసింగ్, శ్రీధర్, సోనాసింగ్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్‌లాల్

### బడిబాటలో ఉపాధ్యాయులు..



ఎస్ఎస్ తాడ్వాయిలో బడిబాటలో ఉపాధ్యాయులు

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని గిరిజన ఆశ్రమ బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా, సౌకర్యాలు లభిస్తున్నాయని, అనుభవజ్ఞులైన టీచర్‌లతో బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పీడీ గద్దం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

**సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య..**

కన్నాయిగూడెం: ప్రైవేటు పాఠశాలల్లో కంటే సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని బుట్టాయిగూడెం ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని బుట్టాయిగూడెం, చింతగూడెం, గుర్రేవుల ముప్పనపల్లి, గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి బాడిబాట కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లిందండ్రులను కోరారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, నీలిమ, ముప్పనపల్లి హెచ్ఎం మల్లయ్య, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేట సర్పంచ్ బొచ్చు సరళ శ్రీనివాస్ తోటి కోడలు బొచ్చు సరిత, అలాగే వరంగల్లోని ఆనంది ఫర్టిలైజర్స్ అధినేత పర్లపల్లి గ్రామస్తుడు ఆనంద్ గారి తండ్రి దిండిగాల నారాయణ మృతి చెందారు. మంగళవారం రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారి సునీత రమేష్, మొగుళ్లపల్లి ఎంపీటీసీ ఎర్రబెల్లి వనిత పున్నంచందర్, ఉప సర్పంచ్ స్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న వెంకటేశ్వర్లు

# అక్రమ వసూళ్లను అరికట్టాలి

ములుగు రూరల్: ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల నుంచి లారీ యజమానులు అక్రమ వాసుళ్లకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు రామస్వామి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో రైతులతో కలసి మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ.. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల నుంచి 40 కేజీల బస్తాకు రూ. 10 చొప్పున వసూళ్లు చేయడం ఏంటని ప్రశ్నించారు. రైతులు పండించిన ధాన్యంలో మిల్లర్లు కోతలు విధిస్తుంటే లారీ యజమానులు అక్రమ వసుళ్లకు దిగుతున్నారని మండిపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వర్‌రావు, శ్రీశైలం, లెనిన్, నర్సయ్య పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృత్యువాత పడిన ఘటన మంగళవారం మండలంలోని వజినపల్లిలో జరిగింది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి సదానందం, ఎర్ర ఎల్లయ్యకు చెందిన గేదెలు మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో పెద్ద ఒర్రె వద్ద విద్యుత్ మోటార్‌కు ఉన్న సర్వీస్‌కు తగిలి మృత్యువాత పడింది. వీటి విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.



విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన గేదె

# నిబంధనల మేరకు విత్తనాలు విక్రయించాలి

కాటారం : విత్తన డీలర్లు నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలని మహదేవపూర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆర్.కె.శ్రీనివాసరాజు తెలిపారు. కాటారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్, బిల్లుబుక్‌ల నిర్వహణ సరిగా చేపట్టాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలన్నారు. ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏవో గిరి రామకృష్ణ, ఏఈవో సరిత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో డీలర్లతో మాట్లాడుతున్న అధికారులు

# ఐజేయూ మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిట్యాల : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 11న జరిగే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ద్వితీయ మహాసభ వాల్‌పోస్టర్లను తహశీల్దార్ సుమన్, సీఐ వేణు చందర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యానికి దిక్సూచిలాంటివన్నారు. విలేకరులు నిజాలను నిర్భయంగా వెలికి తీయాలన్నారు. అనంతరం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల రవి తేజ మాట్లాడుతూ ఈ మహాసభకు కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. విలేకరులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుర్రం చందు, నాయకులు రామచంద్రమూర్తి, గజనాల మహేందర్, కాత్రేవుల ఐలయ్య, తదతరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ వేణు చందర్, ఐజేయూ నాయకులు

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



దుంపిల్లపల్లిలో విద్యార్థుల పేర్లు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు



బోర్లగూడెంలో...

మహాముత్తారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బోర్లగూడెం, ప్రేమ్‌నగర్, దుంపిల్లపల్లి, ములుగుపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు భోజ్యానాయక్, వెంకటేశ్వర్లు, రమేశ్, నవీన్, మౌనిక, పల్లవి తదితరులు ఉన్నారు.

# చిరు ధాన్యాలపై అవగాహన

పలిమెల : మండలంలోని బూరుగ్గూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మహాదేవ్‌పూర్ సీడీపీఓ రాధిక.. బాలికలు, బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కమ్మ, ఎంపీపీ బుచ్చక్క, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివాని, టీచర్లు శివమ్మ, నీలవేణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక